




పట్టణంలోని ఇవిఎం గోడౌన్‌ను రాజకీయ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ నిశాంత్‌కుమార్, డిఆర్‌ఒ వెంకట్రావు శనివారం పరిశీలించారు.
-ప్రజాశక్తి - పార్వతీపురం

కౌన్సిలర్ల బాహాబాహీ

- పట్టణ అభివృద్ధిపై మున్సిపల్ సమావేశంలో సభ్యుల ధ్వజం
- అధికార, ప్రతిపక్ష సభ్యుల కొట్లాట
- నిరసనగా వైసిపికి కౌన్సిలర్ రాజీనామా

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని ప్రజలు పలు సమస్యలతో సతమతమవుతున్నారని, అయినా అధికార పార్టీ కౌన్సిలర్లు పట్టణంలో అభివృద్ధి జరిగినట్లు చెబుతుండడం హాస్యాస్పదమని ప్రతిపక్ష టిడిపి కౌన్సిల్ సభ్యులు ధ్వజమెత్తారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరీ అధ్యక్షతన సాధారణ సమావేశంలో జరిగింది. ఈ అజెండాలో పొందుపరిచిన అంశాలను మున్సిపల్ ఉద్యోగి చదివి వినిపించగా, అధికార పార్టీ కౌన్సిల్ సభ్యులు అజెండాలో పొందుపర్చిన 33 అంశాలను, టేబుల్ అజెండాలో ఉన్న రెండు అంశాలను ఆమోదించారు. జీరో అవర్లో 14వ వార్డు టిడిపి కౌన్సిల్ సభ్యులు ద్వారపూడి శ్రీదేవితో పాటు, కౌన్సిలర్లు కోరాడ నారాయణరావు, టి.వెంకట్రావు, బడే గౌరీ నాయుడు, కోలా సరిత మాట్లాడుతూ పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ సరఫరా అధికారులను నిలదీస్తూ సమగ్ర తాగునీటి సరఫరాకు రూ.63.63కోట్లతో చేపట్టిన పైలట్ ప్రాజెక్టు కాగితాలకే పరిమితమైందని, పనులు అర్ధాంతరంగా ఆగిపోయావని, డంపింగ్ యార్డ్ తరలింపు కూడా జరగలేదని అన్నారు. మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్ప నాయుడు వచ్చి ఏడాదిన్నర అయినప్పటికీ పట్టణంలో ఏ మేరకు అభివృద్ధి జరిగిందో తెలపాలని 8వ వార్డు కౌన్సిలర్ కోరాడ నారాయణరావు ప్రశ్నించడంతో వైసిపి, టిడిపి కౌన్సిల్ సభ్యుల మధ్య కాసేపు వాగ్వివాదం జరిగింది. స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అన్ని వార్డులను అభివృద్ధి చేస్తున్నామని అనడంతో, తాము అధికారులను ప్రశ్నిస్తే, మీరు సమాధానం చెబుతారా అని, ప్రతిపక్ష కౌన్సిలర్లు అసంతృప్తితో సమావేశం నుంచి బైటికి వెళ్లిపోయారు.

2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.9.88 కోట్లు బడ్జెట్

2024-25కు గానూ రూ.9.88 కోట్ల అంచనా బడ్జెట్‌ను మున్సిపల్ అధికారులు రూపొందించగా, అధికార పార్టీ కౌన్సిలర్లు ఆమోదించారు. అలాగే వచ్చే ఆర్థిక సంవత్సరం మార్చి 31 నాటికి మిగులు బడ్జెట్ రూ.9.55 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. సమావేశంలో పాలకవర్గ కౌన్సిల్ సభ్యులతో పాటు కార్యాలయంలోని పలు విభాగాలు అధికారులు పాల్గొన్నారు

వ్యక్తి గత దూషణలతో వైసిపి, టిడిపి కౌన్సిల్ బాహాబాహీ



టిడిపి కౌన్సిలర్‌పై దాడికి వ్యతిరేకంగా కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న పార్టీ కార్యకర్తలు



ఘర్షణ పడుతున్న వైసిపి, టిడిపి కౌన్సిలర్లు

సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయిన టిడిపి కౌన్సిలర్లు సాధారణ సమావేశంలో తమ సమస్యలు చెప్పుకునేందుకు అవకాశం లేకుండా పోతుందని విలేకరులకు తెలిపారు. ఈ సమయంలో 25వ వార్డు కౌన్సిలర్లు నిమ్మకాయల సుధీర్ కౌన్సిల్ సమావేశంలో తనను సారా వ్యాపారం చేస్తున్నట్లు మాట్లాడతావా అని 8వ వార్డు కౌన్సిలర్ కోరాడ నారాయణరావుపై దాడికి దిగడంతో ఇద్దరి మధ్య కొంతసేపు వాగ్వివాదం, తోపులాట జజరిగింది. దీంతో కొంతమంది ప్రైవేటు వ్యక్తులు దాడికి దిగడంతో మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. దీంతో అధికార, ప్రతిపక్ష కౌన్సిల్ సభ్యులు అడ్డుకున్నారు. అనంతరం వైసిపి, టిడిపి కౌన్సిలర్లు పట్టణ పోలీస్ స్టేషన్లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. పట్టణ సిఐ కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

దాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

మున్సిపల్ కార్యాలయంలో 8వ వార్డు కౌన్సిలర్ కోరాడ నారాయణరావుపై వైసిపి కౌన్సిలర్ సుధీర్ దాడి చేసిన నేపథ్యంలో, పట్టణంలో గల కాపు సంఘం నాయకులు స్థానిక పాత బస్టాండ్ కూడలి నుంచి నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం వరకు కొవ్వొత్తులతో ర్యాలీ చేసుకుంటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మజ్జి వెంకటేష్, బార్నాల శీతారాం, రణభేరి శివకుమార్ తదితరులు మాట్లాడుతూ మున్సిపాలిటీకి ఎంతో మంచి చరిత్ర ఉందని, ఒకరిపై ఒకరు దాడులు జరుపుకోవడం మంచి పరిణామం కాదని, ఈ సంఘటనను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. టిడిపి కౌన్సిలర్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఒకటో వార్డు కౌన్సిలర్ రణభేరి శివకుమార్ వైసిపికి రాజీనామా చేశారు.

జిల్లా అభివృద్ధిలో 2023 కీలకం : కలెక్టర్

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లా అభివృద్ధిలో 2023 సవత్సరం కీలక పాత్ర పోషించిందని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. సమగ్రమైన జిల్లాగా రూపాంతరం చెందేందుకు, అభివృద్ధి పథంలో ముందుకు సాగడంలో ఈ ఏడాది బాగా సహకరించిందని, 2024 నూతన సంవత్సరం కూడా జిల్లా అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని ఆకాంక్షించారు. కలెక్టరేట్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. 2023లో అభివృద్ధి లక్ష్య సాధనలో పూర్తి స్థాయి దృష్టి సారించామని, తద్వారా మంచి ఫలితాలు వచ్చాయని తెలిపారు. అలాగే ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరుగుతుందని, ఈ ఏడాది ఇప్పటి వరకు 1.08 లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రూ.132 కోట్ల విలువ చేసే ధాన్యం కొనుగోలు చేసి ఇప్పటి వరకు రూ.58 కోట్లు చెల్లించామని, మిగిలిన మొత్తం మూడు రోజులలో జమ కానుందని అన్నారు. గృహ నిర్మాణ రంగంలో మంచి అభివృద్ధి సాధించి రాష్ట్రంలో నాలుగో స్థానంలో జిల్లా ఉందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కింద రూ.44.73 కోట్లతో పనులు మంజూరు చేశామని, అందులో 400 పనులు పూర్తయ్యాయని, 1413 పనులు ప్రగతిలో ఉన్నాయని తెలిపారు. ప్రాధాన్య తా భవనాల పను ల్లో గ్రామ



సచివాల యాల భవనాలు 125, రైతు భరోసా కేంద్రాలు వంద పూర్తి చేశామని, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు (వెల్ నెస్ కేంద్రం) 192 నిర్మాణంలో ఉన్నాయని కలెక్టర్ చెప్పారు. రూ.1259 కోట్లతో రహదారులు మంజూరు చేశామన్నారు. వైద్య రంగంపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. 37 పిహెచ్‌సిల్లో సిబ్బంది పూర్తి స్థాయిలో నియామకం జరిగిందన్నారు. జిల్లాలో మాతా, శిశు మరణాల రేటు గణనీయంగా తగ్గించామని చెప్పారు. జిల్లా ఏర్పాటు చేసిన సమయంలో మరణాల రేటు 28 ఉండగా ప్రస్తుతం 9 తగ్గిందన్నారు. ఉద్యాన కళాశాల వద్ద వైద్య కళాశాల నిర్మాణానికి మట్టి పరీక్షలు జరిగాయని, డిజైన్ తుది రూపంలో ఉందని చెప్పారు. కురుపాం, భద్రగిరి, సీతంపేట సిహెచ్‌సిల ఆధునీకరణ పనులు జరుగుతున్నాయని, సీతంపేటలో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు ఇంకా 20 శాతం మిగిలి ఉన్నట్టు తెలిపారు. పార్వతీపురంలో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు వేగవంతమవుతున్నాయని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జిల్లాలో 292 శిబిరాలు నిర్వహించగా 1,29,191 మంది వైద్య సేవలు వినియోగించుకున్నారని చెప్పారు.

వైఎస్‌ఆర్ చేయూత నాలుగో విడతలో 77,995 మందికి జనవరి 5 నుంచి రూ.146.39 కోట్లు పంపిణీ జరుగుతుందన్నారు. జల్ జీవన్ మిషన్ కింద 40 వేల గృహాలకు ఇంటింటికీ కొళాయిలు వేశామని, ఈ వారంలో 2 వేల ఇళ్లకు కొళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. జిల్లాలో కమ్యూనికేషన్ వ్యవస్థను పెద్ద ఎత్తున నెలకొల్పామని, మారుమూల గ్రామాలకు సెల్ ఫోన్ నెట్వర్క్ అందించామన్నారు. ఈ ఏడాది జిల్లాలో 2540 మంది లబ్ధిదారులకు 1947 ఎకరాల్లో డి - పట్టా భూములు పంపిణీ చేశామని, మరో 506 ఎకరాల్లో 681 మందికి పంపిణీ చేసే ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో 300 గ్రామాల్లో రీ సర్వే పూర్తయ్యిందని, భూ హక్కు పత్రాలు పంపిణీ చేసినట్టు తెలిపారు. విద్యా వ్యవస్థ మెరుగు ముఖ్యంగా టెన్త్ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతకు "మై స్కూల్ మై ప్రైడ్" కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ ఏడాది అన్ని రంగాల్లో గణనీయ ప్రగతి సాధించామని, ఇందుకు సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, భాగస్వాములు అయిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

2 నుంచి రెండో విడత ఆరోగ్య సురక్ష

పార్వతీపురంరూరల్ : జగనన్న ఆరోగ్య సురక్ష రెండో దశ జనవరి 2 నుంచి ప్రారంభమవుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు తెలిపారు. ఇందుకు సంబంధించి కార్యచరణ సిద్ధం చేశామన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. వైద్య ఆరోగ్య శాఖ కార్యక్రమాలపై శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు, ఇప్పటి వరకూ వైద్య, ఆరోగ్యశాఖ చేపట్టిన ప్రగతి నివేదికను వివరించారు. అలాగే ప్రస్తుతం కోవిడ్ వ్యాప్తిలో ఉన్నందున ప్రతి ఒక్కరూ భౌతిక దూరం పాటించాలని, శానిటైజేషన్ చేసుకోవాలని, లక్షణాలు ఉంటే వెంటనే ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సమావేశంలో ఆర్‌బిఎస్‌కె ప్రాజెక్టు అధికారి డా ధవళ భాస్కరరావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎం.నారాయణరావు, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి. జగన్మోహన రావు, డాక్టర్ ఎం. వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సంధ్యారాణి x తేజోవతి





ఐవిఆర్ఎస్ ద్వారా టిడిపి అభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి - సాలూరు

నియోజకవర్గ టిడిపి తెరపై కొత్త అభ్యర్థి పేరు కనిపిస్తోంది. ఇన్‌ఛార్జి జి.సంధ్యారాణికి పోటీగా మరో గిరిజన నాయకురాలు టిడిపి టిక్కెట్ ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. శనివారం పార్టీ కార్యాలయం నుంచి అనేక మంది టిడిపి కార్యకర్తలు, అభిమానులకు ఐవిఆర్ఎస్ ద్వారా ఫోన్ కాల్స్ వచ్చాయి. సాలూరు అసెంబ్లీ అభ్యర్థిగా ఎవరైతే బాగుంటుందనే అభిప్రాయాన్ని సేకరించేందుకు ఫోన్ కాల్స్ వచ్చినట్లు పార్టీ శ్రేణులు చెపుతున్నాయి. నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంధ్యారాణి, తేజోవతిల్లో ఎవరైతే మంచిదనే కోణంలో అభిప్రాయాలను కోరడం నియోజకవర్గ రాజకీయాల్లో సరికొత్త చర్చకు తెరలేపింది. ఇంతవరకు నియోజకవర్గ ఇన్చార్జి సంధ్యారాణే రానున్న ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది. అయితే చాపకింద నీరులా ఆమెను వ్యతిరేకించే గ్రూపు నాయకులు పార్టీకి కొత్త అభ్యర్థుల పేర్లను సూచించారు. మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్ అనుచరులు సంధ్యారాణి అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ నాయకత్వం సంధ్యారాణికి ప్రత్యామ్నాయంగా ముగ్గురు కొత్త అభ్యర్థుల పేర్లను పరిశీలనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. వీరిలో ఇద్దరు ఉపాధ్యాయులు, ఒక రిటైర్డ్ పోస్టల్ ఉద్యోగి పేర్లు ఉన్నాయి. ఆ ఇద్దరు ఉపాధ్యాయుల్లో ఒకరైన మొజ్జారు తేజోవతి పేరు తాజాగా ఐవిఆర్ఎస్ ద్వారా అభిప్రాయ సేకరణలో వినిపిస్తోంది. దీంతో పార్టీ శ్రేణుల్లో నవ్యోత్సాహం కనిపిస్తోంది. నిన్న మొన్నటి వరకు స్తబ్దుగా ఉన్న టిడిపిలో తాజా అభిప్రాయ సేకరణ సరికొత్త రాజకీయ సమీకరణాలకు నాంది పలుకుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఎవరీ తేజోవతి?

టిడిపి తెరపై వినిపిస్తున్న కొత్త అభ్యర్థి పేరు ఎం.తేజోవతి. ఈమె విజయనగరం జిల్లా వంగర మండలం అరసాడలో ఎంపిపి పాఠశాల హెచ్ఎంగా పని చేస్తున్నారు. ఆమె కొండదొర ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన మహిళ. నియోజకవర్గ టిడిపి టిక్కెట్ ఆశిస్తున్న తేజోవతి ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు జిల్లా యంత్రాంగం ఆమె రాజీనామాను ఆమోదించినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లా టిడిపి రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తున్న బొబ్బిలి రాజుల ఆశీస్సులు కూడా ఆమెకు పుష్కలంగా ఉన్నట్లు తెలుస్తోంది.

ఉద్యోగుల పోరాటాలకు ప్రజాసంఘాల మద్దతు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

రాష్ట్రంలో సమ్మె చేస్తున్న అంగన్వాడి, మున్సిపల్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పార్వతీపురం మన్యం జిల్లా ప్రజా సంఘాల నాయకులు వారికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సమ్మెలో ఉన్న ఉద్యోగులు, కార్మికులకు సంఘీభావంగా శనివారం పార్వతీపురం ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి కలెక్టర్ ఆఫీస్ వరకు సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు సంఘాల ఆధ్వర్యంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు వై మన్మధరావు, టి.జీవరత్నం, గొర్లి వెంకటరమణ, పి. శ్రీనునాయుడు తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో కార్మికులు, ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ అనేక రోజులుగా సమ్మె నిర్వహిస్తున్నా ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం విచారకరమని ఆందోళన వ్యక్తం చేశారు. 19 రోజులుగా అంగన్వాడీలు, మునిసిపల్ ఉద్యోగులు ఐదు రోజులుగా, సమగ్ర శిక్ష ఉద్యోగులు 11 రోజులుగా సమ్మె చేస్తున్నారని వీరితో చర్చలు జరిపాల్సిన ప్రభుత్వం చర్చలు జరపకుండా మొండిగా వ్యవహరిస్తుందని అన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కూడా అమలు చేయడానికి సిద్ధ పడకపోవడం దుర్మార్గమని అన్నారు. సమ్మె చేస్తున్న ఉద్యోగులను బెదిరింపులకు పాల్పడి షోకాజ్ నోటీసులు ఇచ్చి క్రమశిక్షణ చర్యలకు పూనుకోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా కార్మికులు, ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయాలని, నిర్బంధాన్ని విడనాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బివి రమణ, వి. ఇందిర, బి.లక్ష్మి, జి. జ్యోతి, శాంతి, ఐఎఫ్‌టియూ నాయకులు సర్వేశ్వరరావు, అఖిల భారత రైతు కూలి సంఘం నాయకులు బి నరసింగరావు, ఎం. భాస్కరరావు, మహిళా సంఘం నాయకులు విజయలక్ష్మి, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు పి. సన్యాసిరావు, జి. తులసి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ



పట్టణంలో సంఘీభావ ర్యాలీ చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

క్రీడా కాంతులు వెదజల్లాలి



విజేతలకు మెమెంటోలు అందజేస్తున్న డివిజి శంకరరావు

- ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డివిజి శంకరరావు
- ముగిసిన రాష్ట్ర స్థాయి బాలల క్రీడా పోటీలు
- ఆల్‌రౌండ్ ఛాంపియన్లుగా సీతంపేట ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి - పాచిపెంట

విద్యార్థులు క్రీడల్లో రాణించాలని రాష్ట్ర షెడ్యూల్ తెగల కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు అన్నారు. మండలంలోని పి.కోనవలస గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో జరుగుతున్న అండర్ 17,19 బాలల రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు - 2023 - 24 ముగింపు ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ విద్యార్థులు విద్యాభ్యాసంతో పాటు క్రీడల్లో రాణించాలని తద్వారా శారీరక, మానసిక వికాసం కలుగుతుందన్నారు. క్రీడల పట్ల ఆసక్తి ఉన్న విద్యార్థులు పట్టుదలతో శ్రమించి ఆయా క్రీడల్లో రాణించి జాతీయ అంతర్జాతీయ స్థాయికి వెళ్లాలని సూచించారు. ఎమ్మెల్సీ పి.రఘువర్మ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సాధారణమని, క్రీడా స్ఫూర్తి గొప్పదని అన్నారు. ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువులోనూ, క్రీడల్లోను రాణించాలన్నారు. రానున్న పదవ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి, రాష్ట్రంలో ఆదర్శంగా నిలవాలని అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. ఈ పోటీల్లో సీతంపేట ఆశ్రమ పాఠశాల బాలిక, బాలురు ఎక్కువ పోటీలుల్లో గెలుపొంది ఆల్‌రౌండ్ ఛాంపియన్లుగా నిలిచారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ సాధికారత అధికారి కె.శ్రీనివాసరావు, ఎంపిపి ప్రమీల, వైస్ ఎంపిపి ధనుంజయ్, ప్రిన్సిపల్ మహేశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు దండి ఏడుకొండలు, నాయకలు డోల బాబ్జీ, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రబీకి సాగునీరివ్వండి

టిడిపి ఆధ్వర్యాన రైతుల రాస్తారోకో

ప్రజాశక్తి - గరుగుబిల్లి

తోటపల్లి పాత కుడి, ఎడమ కాలువ ద్వారా రబీ సాగుకు నీరివ్వాలని మండల టిడిపి అధ్యక్షులు అక్కేన మధుసూదనరావు ఆధ్వర్యంలో మండలంలోని ఖడ్గవలస జంక్షన్‌లో రైతులతో కలిసి నాయకులు రాస్తారోకో చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి టి.జగదీశ్వరి మాట్లాడుతూ ఈ ప్రభుత్వానికి రైతుల బాధ తెలియడంలేదని, ప్రాజెక్టు నిండా నీరున్నా పంట పొలాలకు నీరివ్వకుండా సముద్రం పాలు చేస్తున్నారని విమర్శించారు. నాలుగేళ్లుగా ప్రాజెక్టు ఆధునికీకరణ పేరు చెప్పి ఒక పని కూడా చేయలేదని విమర్శించారు. ఇప్పటికైనా ఆయకట్టు రైతులతో సమావేశం ఏర్పాటు చేసి ఆరుతడి పంటలకు నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నీరు విడుదల చేయనిచో భవిష్యత్తులో ప్రాజెక్టు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎం.పురుషోత్తమనాయుడు, అంబటి రాంబాబు, ఎంబి విజయ అంకుశం, పార్టీ కన్వీనర్లు శేఖర్ పాత్రుడు, కలిశెట్టి కొండయ్య, పల్లా రాంబాబు, డొంకాడ రామకృష్ణ, దేవకోటి వెంకట నాయుడు, పెద్దింటి పూర్ణచంద్రరావు, కోటా సుమన్, భరత్, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



ఖడ్గవలస జంక్షన్‌లో టిడిపి ఆధ్వర్యాన ఆందోళన చేస్తున్న రైతులు

ఆందోళనలో వేతన జీవులు...

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, సామాజిక భద్రత కల్పించాలని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వివిధ రంగాలకు చెందిన స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఆందోళన చేస్తుండగా, ఎన్నికల్లో మరోసారి అధికారాన్ని చేజిక్కించుకునే దిశగా ప్రభుత్వం ప్రచార పర్వంలో మునిగిపోయింది. వేతన జీవుల ఆవేదన, ఆక్రందన పక్కనబెటి ఆసరా, చేయూత పేరిట ప్రజల్లో పరోక్షంగా ఎన్నికల ప్రచారానికి తెరలేపింది. ఉద్యోగులు, కార్మికుల సమ్మెలను, సమస్యలను పక్కనబెట్టి నేలవిడిచి సాము చేసినట్టుగా వ్యవహరించడంతో సగటు ప్రజానీకం నివ్వెరబోతున్నారు. పైగా ఎన్నికల హామీలన్నీ నెరవేర్చినట్టుగా ఎమ్మెల్యేలు, మంత్రులు బుకాయిస్తుండడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె చేపట్టి సుమారు 20రోజులు కావస్తోంది. వివిధ రూపాల్లో నిరసనలు తెలుపుతునే ఉన్నారు. వీరిపట్ల సానుకూలంగా వ్యవహరించాల్సిన ప్రభుత్వం సచివాలయం ఉద్యోగులతో తెరిపించి అబాసుపాలైంది. పిల్లల తల్లిదండ్రులు సైతం అంగన్‌వాడీలకు సంఘీభావం తెలియజేయడంతో అటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇటు అధికారులు నాలుక కరుచుకున్నారు. పైగా తెలంగాణాలో పెంచిన ప్రతిసారి అంగన్‌వాడీలకు వేతనాలు పెంచుతామని చెప్పలేదంటూ జిల్లాకు చెందిన విద్యాశాఖ మంత్రి సమర్థించుకున్నారు. దీంతో, అంగన్‌వాడీలు తగ్గేదేలే అన్నట్టుగా మొక్కవోని దీక్షతో సమ్మెను ముందుకు నడుపుతున్నారు. ఈనేపథ్యంలోనే రాష్ట్ర వ్యాప్తంగా మంత్రుల ఇళ్ల ముట్టడిలో భాగంగా శనివారం మంత్రి బొత్స ఇంటి వద్ద బైఠాయించారు. వీరి స్ఫూర్తితో సర్వశిక్షాభియాన్ పరిధిలోని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కెజిబివి ఉపాధ్యాయులు, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సైతం సమ్మెలోకి దిగారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూన్నారు. వీరే గాక విఆర్‌ఎలు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, ఆశావర్కర్లు, మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం ఔట్ సోర్సింగ్ కార్మికులు ఎక్కడికక్కడ నిరసన తెలుపుతున్నారు. వీరే కాదు సచివాలయ వాలంటీర్లు సైతం తమకు రూ.18వేలు వేతనం ఇవ్వాలంటూ సమ్మె నోటీసులు అందజేయడంతో అధికార పార్టీ నాయకులు షాక్‌కు గురయ్యారు. మరోవైపు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కూడా పిఆర్‌సి, డిఎ బకాయిలు కోసం ధర్నాలు చేపడుతున్నారు. వీరు కోరుతున్నవేవీ గొంతెమ్మ కోర్కెలు కాదు. ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలతోపాటు కనీస వేతనాలు, సదుపాయాలు, ఉద్యోగ భద్రత వంటి అంశాలనే అమలు చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో ఆయా విభాగాల సేవలు ఎక్కడికక్కడ స్తంభిస్తున్నాయి. మున్సిపల్ కార్మికుల సమ్మెతో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతోంది. ఇటువంటి పరిస్థితుల్లో కార్మికులు, ఉద్యోగుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం లేదు సరికదా ఆసరా, చేయూత పథకాల అమలు పేరిట 1వ తేదీ నుంచి జనాల్లోకి వెళ్లేందుకు నిర్ణయించింది. 3వ తేదీన పెంచిన అసరా పింఛన్లు పంపిణీ సిఎం జగన్మోహన్‌రెడ్డి వర్చువల్ పద్ధతిలో ప్రారంభిస్తారట. ఆ రోజు అన్ని సచివాలయాల్లోనూ టీవీలు ఏర్పాటు చేసి మరీ లబ్ధిదారులను హాజరుపర్చాలని మంత్రి బొత్స ఆదేశాలు జారీచేశారు. దానికి ముందు 1, 2వ తేదీల్లో వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం పథకాల ద్వారా వారికి చేకూరిన లబ్ధిని వివరించాలని ప్రభుత్వం ఒత్తిడిచేస్తోంది. 4వ తేదీ నుంచి ప్రతి నియోజకవర్గంలోనూ రోజుకో మండల కేంద్రంలో పండగ వాతావరణంలో సభలు నిర్వహించాలని మంత్రి దిశానిర్దేశం చేశారు. విందు, వినోద కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమాలు 8వ తేదీ వరకు జరుగుతాయి. ఆ తరువాత చేయూత కార్యక్రమం ఫిబ్రవరి 25వ తేదీ వరకు చేయూత పథకంపై ప్రచారం చేపట్టనున్నారు. దీన్నిబట్టి సమ్మెలు, ఉద్యోగులు, స్కీమ్ వర్కర్ల సమస్యలు, బాధలు ప్రభుత్వానికి పట్టలేదని, వ్యతిరేకతను కప్పించుకునేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలపై ప్రచారానికి తెరలేపిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

యుటిఎఫ్ కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక విద్యాశాఖ కార్యాలయం ఆవరణలో యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారులు డి గౌరునాయుడు, ఆర్.ఆనందరావులు శనివారం యుటిఎఫ్ 2024 కేలండర్, డైరీలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు, మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు బి. దుర్గాప్రసాద్, కె.గోవిందరావు, వి.శ్రీధర్, యం.ముకుందరావు, వి.అన్నాజీరావు, వి.చంద్రమోహన్, బి.వాసుదేవరావు, సూర్యప్రకాష్, రాజేష్, గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ

గరుగుబిల్లి: మండల పరిధిలోని చిన్నగుడబ గ్రామంలో డాక్టర్ వైయస్ స్టార్ ఆరోగ్యశ్రీ పథకానికి సంబంధించి ప్రభుత్వం నూతన ఫీచర్లతో విడుదల చేసిన ఆరోగ్యశ్రీ కార్డులను శనివారం ఎంపిడిఒ జి. పైడితల్లి, పంచాయతీ కార్యదర్శి శిరీష పంపిణీ చేశారు. ఇంత వరకు ఐదులక్షల రూపాయలు వరకు ఉన్న ఆరోగ్యశ్రీ పథకాన్ని 25 లక్షల రూపాయలకు పెంచినట్లు వివరించారు. ప్రస్తుతం కొత్తగా వచ్చిన ఆరోగ్యశ్రీ కార్డులను సచివాలయ కార్యాలయాలు పంపిణీ చేసామన్నారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికీ పంపిణీ చేస్తారని వెల్లడించారు.

వ్యాసరచనలో నర్సిపురం విద్యార్థిని ప్రతిభ

పార్వతీపురం రూరల్: మండలంలోని నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని షణ్ముఖ ప్రియ ఎస్‌పి కార్యాలయం నిర్వహించిన వ్యాసరచన పోటీలో ప్రతిభ కనబరచి బహుమతి పొందినట్లు ప్రధానోపాధ్యాయులు వెంకట నాయుడు శనివారం తెలిపారు. మహిళల భద్రత అనే అంశం మీద మండల, జిల్లా స్థాయిలో జిల్లా పోలీసు శాఖ నిర్వహించిన ఈ పోటీల్లో 10వ తరగతి విద్యార్థిని మండల స్థాయిలో ప్రథమ స్థాయి, జిల్లా స్థాయిలో తృతీయ బహుమతిని గెలుచుకుంది. ఈ మేరకు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ నుండి బహుమతితో పాటు వెయ్యి రూపాయల పారితోషికాన్ని అందుకొన్నందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటనాయుడు, ఉపాధ్యాయులు బాలకృష్ణ, వెంకటనాయుడు తదితరులు అభినందించారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

కొమరాడ : పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని, ప్రతి ఒక్కరూ మొదటి తరగతిలో ఉత్తీర్ణులు కావాలని ఆర్‌డిఒ కె.హేమలత తెలిపారు. దత్తత పాఠశాల సందర్శన కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక కెజిబివి పాఠశాలను ఆర్‌డిఒ సందర్శించారు. తరగతి గదులు సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. వారికి జరుగుతున్న బోధనను, నోటు పుస్తకాలను పరిశీలించారు. ప్రతి విద్యార్థిని కష్టపడి చదవాలని, పాఠ్యాంశాలలో అనుమానాలుంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ప్రత్యేక అధికారి అరుణ, సిబ్బంది ఉన్నారు.

రికార్డులో వివరాలు పొందుపర్చాలి

వీరఘట్టం: ప్రజలకు సంబంధించిన ఏ రకమైన దరఖాస్తులు ఆన్లైన్ చేసినా వాటి వివరాలు రికార్డులో పొందుపర్చాలని తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ సచివాలయ డిజిటల్ సహాయకులను ఆదేశించారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డిజిటల్ సహాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మీరు ఆన్లైన్ చేస్తున్నట్టే తప్పు ఐఏ మా వద్దకు రాకపోవడం వల్ల పెండింగ్ చూపిస్తున్నాయని, ఏదైతే ఆన్లైన్ చేసి ఉన్నారో ఆ సంబంధిత అధికారు లకు తెలియపర్చాలని సూచించారు. ప్రతీ నిక్షిప్తంగా పరిశీలించి ఆన్లైన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపతహసీల్దారు కుమారస్వామి, సిఎస్‌డిటి మల్లేశ్వర రావు, మండలంలోని అన్ని సచివాలయాల డిజిటల్ సహాయకులు పాల్గొన్నారు.

కల్యాణమస్తు నిధులు మంజూరు

గుమ్మలక్ష్మీపురం: స్థానిక గ్రామ సచివాలయ పరిధిలో అర్హులైన నిమ్మక పద్మ పాలక ఆశోక్‌కి వైయస్సార్ కల్యాణమస్తు పథకం ద్వారా రూ.లక్ష రూపాయలు వారి ఖాతాల్లో జమ చేయడం జరిగిందని సర్పంచ్ బి.గౌరీశంకర్రావు తెలిపారు. గ్రామ సచివాలయంలో గ్రామపెద్దల సమక్షంలో లబ్ధిదారులకు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కిషోర్, మాజీ సర్పంచ్ ప్రేమానంద్, మాజీ ఉపసర్పంచ్ ఎద్దు మురళి, వార్డు సభ్యులు జిన్నాన వెంకట్రావు, వైసిపి నాయకులు అబ్దుల్ వహీద్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

లోవరకండిలో గడపగడపకు..

మక్కువ: మండలంలోని డి.సిర్లాం పంచాయతీ లోవరకండిలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ సిఎంగా జగన్మోహన్‌రెడ్డిని ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు శ్రీనివాసనాయుడు, మండల వైసిపి అధ్యక్షులు రంగునాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జరడలో 'మళ్లీ జగనే ఎందుకు కావాలి?'

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని గిరిశిఖర పంచాయతీ అయిన జరడలో శనివారం మళ్లీ సిఎం జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామం వద్ద ఎంపిపి శెట్టి పద్మావతి వైసిపి జెండాను ఆవిష్కరించారు. అనంతరం సచివాలయం వద్ద ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ఆంధ్రకు సిఎం ఎందుకు కావాలనే దాని గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల వైసిపి కన్వీనర్ ఐ.గౌరీ శంకర్, జెడ్పిటిసి జి.సుజాత, వైస్ ఎంపిపిలు అన్నాజీరావు, రంగారావు, వైసిపి వాణిజ్య విభాగాల జిల్లా అధ్యక్షులు ఉంధవరపు కోటేశ్వరరావు, ఎఎంసి మాజీ చైర్మన్ ఎన్.వెంకట్రావు, సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైసిపి నాయకులు, పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

తోటపల్లి వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆలయ హుండీలు శుక్రవారం ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులు, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు, ఆలయ కార్యనిర్వహణాధికారి వివి సూర్యనారాయణ సమక్షంలో తెరిచి లెక్కించారు. హుండీ నుంచి మొత్తం రూ.4,47,605 శ్రీ కోదండ రామస్వామి వారి ఆలయ హుండీల నుంచి వచ్చిన మొత్తం రూ.11,152 వచ్చింది. కార్యక్రమంలో పర్యవేక్షణ నిమిత్తం పాలకొండ గ్రూప్ దేవాలయం ఇఒ సర్వేశ్వరరావు విచ్చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మర్రాపు సత్యనారాయణ, సభ్యులు గౌరీశంకర్ పాత్రో, కుసుమూరు సాగర్ తదితరులు పాల్గొన్నారు.



ఇవిఎంలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఇవిఎంలపై అవగాహన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని సుమిత్రపురం, పెదలంకలం గ్రామాలలో ప్రజలకు ఇవిఎంల ఓటింగ్ విధానంపై శనివారం అవగాహన కల్పించారు. గ్రామంలో ఇవిఎం యంత్రాలను ఏర్పాటు చేసి ఓటింగ్ ఎవరికి వేస్తున్నామనేది తెలుసుకునేందుకు ఈ విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఒ సోమేశ్వరరావు, మహిళ పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వం తప్పుడు ప్రచారం మానుకోవాలి

డిప్యూటీ సిఎంను కోరిన ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి - మక్కువ

ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ 19 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం పనిగట్టుకొని తప్పుడు ప్రచారం నిర్వహిస్తుందని, చిత్తశుద్ధి ఉంటే తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని ఉప ముఖ్యమంత్రి పి.రాజన్నదొరను ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మండలంలోని కోనలో రాజన్నదొరకు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు ఎల్.దానమ్మ, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, పలువురు కార్యకర్తలు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంగన్వాడీలకు టిఎ, డిఎలు పూర్తిగా నిలిచిపోయాయని నేటికీ విడుదల చేయని పరిస్థితి ఉందని అన్నారు. తెలంగాణ కన్నా అదనంగా వెయ్యి రూపాయలు వేతనం ఇస్తామని సిఎం హామీ ఇచ్చారని, ఆ హామీ నాలుగున్నరేళ్లయినా అమలు చేయలేదని అన్నారు. తమ సమస్యలను పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, పరిష్కారంలో చిత్తశుద్ధిలేదని విమర్శించారు. శాంతియుతంగా తమ న్యాయమైన సమస్యలు అడుగుతుంటే ప్రభుత్వం అంగన్వాడీలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దీన్ని యూనియన్ ఖండిస్తుందని, వెంటనే న్యాయమైన తమ సమస్యలు పరిష్కరించేలా కృషి చేయాలని, లేకుంటే జరిగే పోరాటాలకు ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. దీనికి రాజ్నదొర స్పందిస్తూ వెంటనే తాను ఈ విషయాలన్నీ లేఖ రాసి తెలియజేస్తానని తెలిపారు. వినతిని అందజేసిన వారిలో అంగన్వాడీ సెక్టార్ నాయకులు బి.జ్యోతి, గౌరీశ్వరి, గుండమ్మ, సుశీల, సీత, గిరిజన సంఘం మండల నాయకులు టి.ప్రభాకరరావు, పలువురు అంగన్వాడీలు పాల్గొన్నారు.


సాలూరు: సచివాలయం ఉద్యోగులకు వినతినిస్తున్న కార్యకర్తలు

పాలకొండ : అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో గల సచివాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, వివిధ ప్రజాసంఘాలు పాల్గొన్నారు. అనంతరం సచివాలయం ఉద్యోగికి వినతి పత్రం అందజేసి సచివాలయం పరిధిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులంతా ఒకరికొకరు సహకారం అందించేలా ఉండాలని, అంగన్వాడీల సమస్యలు పరిష్కారమయ్యే వరకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సాలూరు రూరల్ : సచివాలయ, వెలుగు సిబ్బంది, వాలంటీర్లతో తమ సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రభుత్వం పూనుకుందని, ఇటువంటి విధానం మంచి పద్ధతి కాదని, తోటి ఉద్యోగులుగా మీరు కూడా తమకు సహకరించాలని కోరుతూ మండలంలోని అన్ని పంచాయతీ కార్యాలయాల్లో అంగన్వాడీ వర్కర్లు సచివాలయ సిబ్బందికి వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, యూనియన్ నాయకులు ఆరిక నారాయణమ్మ, తిరుపతమ్మ, పుష్ప, జానకీకుమారి, సిఐటియు నాయకులు ఎన్‌వై నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలో అంగన్వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా గ్రామ సచివాలయాల వద్ద సిఐటియు మండల కార్యదర్శి గవర వెంకటరమణ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం పంచాయతీ ఇఒ గేదెల వెంకట్రావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సెక్టార్ నాయకులు ఎం.సునీత, అంగన్వాడీలు సుజాత, లక్ష్మి, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలో అంగన్వాడీలో నిరవధిక సమ్మె కొనసాగుతుంది. ఈ సందర్భంగా సోమగండి, కుసిమి, సీతంపేట గ్రామ సచివాలయ అధికారులకు అంగన్‌వాడీలు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎ.పార్వతి, ఎ.దర్శమి, సిఐటియు మండల కార్యదర్శి ఎం.కాంతారావు కార్యకర్తలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు సచివాలయాల ఎదుట ధర్నా చేశారు. ఇందులో భాగంగా మండలంలోని ఎల్విన్ పేట, ఇరిడి, దుమ్మంగి, రెల్ల, తాడికొండ, లంబేసు, దుడ్డు ఖల్లు, చెముడు గూడ తదితర సచివాలయాలు ఎదుట అంగన్వాడీ ఉద్యోగులు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అలాగే జియమ్మవలసలో అంగన్వాడీలు సచివాలయ ఉద్యోగులకు వినతి అందించారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్, కోశాధికారి మండంగి రమణ, నాయకులు పువ్వల మోహన్‌రావు, తిరుపతిరావు, సన్యాసిరావు, ఇరిడి ఎంపిటిసి కడ్రక మల్లేశ్వరరావు, టిడిపి నాయకులు సుధ తదితరులు ఉన్నారు.

వీరఘట్టం : తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని తలవరం, చిటిపూడివలసలో సచివాలయ కార్యదర్శులకు అంగన్‌వాడీలు వినతులు అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.


గుమ్మలక్ష్మీపురం: నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


మక్కువ: డిప్యూటీ సిఎంకు వినతినిస్తున్న అంగన్‌వాడీలు

పాచిపెంట : మండలంలోని గురునాయుడుపేట సచివాలయం వద్ద పాచిపెంట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సెక్టార్ నాయకులు అమ్మాజీ, గౌరీశంకరమ్మ ఆధ్వర్యంలో సచివాలయం సెక్రటరీకి వినతిపత్రం అందజేశారు.

కొమరాడ : స్థానిక సచివాలయం వద్ద అంగన్‌వాడీలు ధర్నా చేశారు. అనంతరం అక్కడ పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు.. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కొమరాడ ప్రాజెక్టు ఉపాధ్యక్షులు సిరికి అనురాధ, నాయకులు జయమ్మ, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

సాలూరు: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు నాయకులు బి.రాధ ఆధ్వర్యాన అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పట్టణంలోని చినహరిజనపేట సచివాలయం వద్ద స్థానికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. . కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్యామల, వరలక్ష్మి, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుపాం : అంగన్వాడీల నిరవధిక సమ్మె సాగుతున్న నేపథ్యంలో శనివారం వారి పరిధిలో గల సచివాలయంలో వారి హక్కులపై నిరసన తెలియజేసి అనంతరం సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు. కురుపాం, జియ్యమ్మవలస మండలాల్లో అన్ని గ్రామ సచివాలయాల్లో అంగన్వాడీలో నిరసన కార్యక్రమానికి అంగన్వాడికి కేంద్రానికి వస్తున్న గర్భిణులు, బాలింతలు,

సాదాసీదాగా నగర పంచాయతీ సమావేశం

ప్రజాశక్తి-పాలకొండ

స్థానిక నగరపంచాయితీ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఈ సమావేశానికి చైర్‌పర్సన్ యందవ రాధకుమారి అధ్యక్షతన శనివారం జరిగిన ఈ సమావేశంలో పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఒప్పంద కార్మికులకు జీతాలిచ్చేందుకు, అదే విధంగా నగరపంచాయితీలో షాపుల లీజు పునరుద్ధరణ, 9సచివాల యాల పరిధిలో అనధికారికంగా ఉన్న కుళాయిలు తొలగించే ందుకు సభ్యులు ఆమోదించారు. సమావేశంలో వైస్ చైర్మన్లు రౌతు హనుమంతరావు, పల్లా ప్రతాప్, కౌన్సిలర్లు వెలమల మన్మథరావు, బాసురు కాంతారావు, కిల్లారి మోహన్ తదితరులు ఉన్నారు.

కార్మికుల సమస్యలు ప్రభుత్వం దష్టి కి తీసుకెళ్లండి

న్యాయమైన తమ సమస్యల పరిష్కారానికి చేస్తున్న సమ్మెలో భాగంగా స్థానిక నగరపంచాయితీ కార్యాల యం ఆవరణలో సమ్మెకు మద్దతు ఇస్తూ కౌన్సిల్‌లో తీర్మానం


కమిషనర్‌కు వినతినిస్తున్న పారిశుధ్య కార్మికులు

చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, కార్మిక సంఘం నాయకులు పడాల భాస్కంరావు, పి.వేణు తదితరులు కోరారు. నగరపంచాయితీ కౌన్సిల్ సమావేశం సందర్భంగా కమిషనర్ సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో వైస్ చైర్మన్ రౌతు హనుమంతరావు, కౌన్సిలర్లతో కలిసి చర్చలు జరిపారు. ఈ సందర్భంగా దావాల రమణారావు మాట్లాడుతూ ఎన్నికల ముందు, అసెంబ్లీ సాక్షిగా జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని చేస్తున్న సమ్మెకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. దీనిపై కమిషనర్ మాటాడుతూ సమ్మె చేస్తున్నప్పటికీ తమకు సహకారాన్ని అందించాలని, పండ గలను దృష్టిలో పెట్టుకుని పారిశుధ్య పనులకు సహకరిం చాలని కార్మికులను కోరారు. మీరు సహకరించకపోతే పోలీసు బందోబస్తుతో కార్మికులను అద్దెకు తెచ్చుకుని పనులు చేయిస్తామని అనడంతో, కార్మికులు అడ్డు తగిలారు. మీరు ఎలా పనులు చేయిస్తారో చూస్తామని కార్మి కులు హెచ్చ రించారు. దీంతో ఇరు వర్గాల మధ్య తీవ్ర వాగ్వి వాదం చోటు చేసుకుంది. దీంతో ఐదో వార్డు కౌన్సిలర్ వెల మల మన్మధ రావు కలుగజేసుకుని ఇరు పక్షాలకు సర్ది చెప్పా రు. అవస రమైతే కార్మికుల సమస్యలపై కౌన్సిల్‌లో అందరూ సంతకాలు చేసి ఆ పత్రాలను సంబంధిత మంత్రికి, విప్ విక్రాంత్‌కు, ఎమ్మెల్యే కళావతికి అందిస్తామన్నారు. స్థానిక సమస్యలపై చర్చించి సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామన్నారు.

విద్యార్థులకు బస్సులు నడపాలి

ప్రజాశక్తి - కొమరాడ

విద్యా సంస్థలకు వెళ్లే విద్యార్థుల రాకపోకల నిమిత్తం ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యం కల్పించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. శనివారం కోటపాడు జిల్లా పరిషత్ పాఠశాల వద్ద బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ విద్యార్థులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్లికోట, దుగ్గి గ్రామాలకు చెందిన విద్యార్థులు సుమారు 90 మంది కోటిపాం, గుణానపురం కాలేజీ, పాఠశాలలకు వెళ్తున్నారన్నారు. హైస్కూల్‌కు వెళ్లాల్సిన విద్యార్థులకు ఉదయం 7.30గంటకు ఒక ట్రిప్పు, సాయంత్రం 4.30 గంటలకు ఒక ట్రిప్పు బస్సు సౌకర్యం కల్లికోట, దుగ్గి మీదుగా కోటిపాము హైస్కూల్‌కు నడపాలని కోరారు. కల్లికోట, దుగ్గి గ్రామాల నుంచి కోటిపాం హైస్కూల్‌కు బస్సు సౌకర్యం కల్పించి విద్యార్థులను అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పెద్దఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

నలుపు దుస్తులతో కార్మికుల నిరసన

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపల్ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు తమ న్యాయమైన కోర్కెలు తీర్చాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఐదో రోజు సమ్మెలో భాగంగా సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ ఆధ్వర్యంలో శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద గల సమ్మె శిబిరంలో పారిశుధ్య కార్మికులు నలుపు రంగు దుస్తులు ధరించి విన్నూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకట రమణ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఆప్కాస్ విధాన కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, ఇంజనీరింగ్ వర్కర్స్ అందరికీ హెల్త్ అలవెన్స్ రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని, సిఎం ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా పారిశుధ్య కార్మికుల సంఘం అధ్యక్షులు నాగవంశం శంకర్రావు, పట్టణ అధ్యక్షులు చీపురుపల్లి సింహాచలం, పడాల గాంధీ, మామిడి శివ, బంగారు రాజేష్, గుంట్రెడ్డి గంగయ్యలు, ఇప్పలమ్మ, పాపులమ్మ, పడాల సంతు, వెంకన్న, సాయి, రవి, సత్తిరాజు, కార్మికులు పాల్గొన్నారు.

సమ్మెకు టిడిపి కౌన్సిలర్లు మద్దతు

మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద చేస్తున్న సమ్మె శిబిరానికి టిడిపి కౌన్సిలర్లు



నల్ల దుస్తులతో నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

ద్వారపురెడ్డి శ్రీదేవి, బడే గౌరునాయుడు, టి. వెంకట్రావు, కోలా సరిత వెళ్లి మద్దతు తెలిపారు.

సాలూరు : పట్టణంలో మున్సిపల్ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు నల్ల దుస్తులు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ పట్టణ అధ్యక్షులు శంకర్, రాముడు మాట్లాడారు. మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం గ్రాడ్యుటీ, ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన జీతం ఇచ్చేంత వరకు ఆందోళన కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు రవి, శ్రీను, పోలిరాజు, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

పివిటిజిల అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి- సీతంపేట

పివిటిజి జాతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొంటుందని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి శ్రీనివాస్ శాంఘే అన్నారు. శనివారం మండలంలోని కీసరజోడు పంచాయతీలోని ఎదురువలస ఆయన గ్రామంలో పర్యటించారు. పిఎం జన్మాన్ పథకం ద్వారా పీవీటీజీ గ్రామాలకు తాగునీరు, రహదారి, గృహ నిర్మాణాల సౌకర్యం, విద్య, వైద్యంతో పాటు మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకొంటుందని అన్నారు. ఈ అవకాశాన్ని పీవీటీజీ ప్రజలందరూ తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. ఈ పథకం ద్వారా గృహ నిర్మాణాలకు రూ.2.30లక్షలు మంజూరు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ రోషిరెడ్డి, ఎంపిడిఒ గీతాంజలి, మండల స్థాయి సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న శ్రీనివాస్ శాంఘే

పార్వతీపురం రూరల్: మండలంలోని పెదబొండపల్లి గ్రామంలో శనివారం ఆంధ్ర, తెలంగాణ రీజియన్ అధికారి శ్రీనివాస్ శాంఘే, ఎంపిడిఒ అకిబ్ జావేద్‌తో కలిసి పర్యటించారు. ప్రధాన మంత్రి జన్ మాన్ కార్యక్రమం గురించి వివరించారు. సర్పంచి తౌడమ్మ, కార్యదర్శి లక్ష్మి, వెలుగు ఎపిఎం సురేష్, హౌసింగ్ ఎఇ చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులపై ఎందుకీ వివక్ష?

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

సమగ్ర శిక్ష ఉద్యోగులపై ప్రభుత్వానికి ఎందుకీ వివక్ష అని ఎస్ఎస్ఎ నాయకులు ప్రశ్నించారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె 11వ రోజుకు చేరుకున్న నేపథ్యంలో శనివారం పార్వతీపురం చర్చి జంక్షన్‌లోని నిరసన శిబిరం నుండి పార్వతీపురం కలెక్టర్ ఆఫీస్ మీదుగా ఆర్‌టిసి కాంప్లెక్స్, సౌందర్య జంక్షన్ వరకు కోలాటం చేస్తూ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు ఈశ్వరరావు, లక్ష్మణరావు, రమేష్ తదితరులు మాట్లాడుతూ విద్యాశాఖలో అత్యున్నతమైన సేవలు అందిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు సంఘీభావంగా పిఆర్‌టియు నాయకులు వి. తవిటి నాయుడు, టిడిపి నియోజకవర్గ


కోలాటం చేస్తూ నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఇంచార్జి బోనేల రవిచంద్ర తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ ర్యాలీలో జెఎసి నాయకులు భాను ప్రకాష్, బివి రమణ, భారతి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు దుప్పట్లు, దోమతెరలు పంపిణీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని సదునుగూడ, గుమ్మలక్ష్మీపురంలో రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో 50 మంది గిరిజనులకు దుప్పట్లు, దోమతెరలు, వ్యక్తిగత పారిశుధ్య కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో తమ సంస్థ పలు సేవా కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. ఆపదలో ఉన్న ప్రజలను ఆదుకోవడమే రెడ్‌క్రాస్ లక్ష్యమన్నారు. గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బొత్తాడ శంకర్రావు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సంస్థ గిరిజన ప్రాంతంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని కొనియాడారు. మరిన్ని సేవా కార్యక్రమాలు హెల్త్ క్యాంపులో నిర్వహించాలని కోరారు. లక్కగూడ సర్పంచ్ సూర్యారావు మాట్లాడుతూ తమ పంచాయతీ పరిధిలోని సదునుగూడ గ్రామస్తులకు దుప్పట్లు, దోమతెరలు పంపిణీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. రెడ్‌క్రాస్ ఇసి సభ్యులు పైడా కొండలరావు మాట్లాడుతూ భవిష్యత్తులో మరింత సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో దోస్త్



దుప్పట్లు పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

మేరా దోస్త్ సంస్థ అధ్యక్షులు ప్రేమనంద్, గ్రామ పెద్ద గుడ్ల హరిప్రసాద్, రెసిడెన్షియల్ కాలేజ్ ప్రిన్సిపల్ యుగంధర్, వర్తక సంఘం కార్యదర్శి మద్ది నాని, అనంతరం పిటిజి గురుకుల పాఠశాల, గురుకుల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు రెడ్ క్రాస్ కార్యకలాపాలు సేవా దృక్పథంపై అవగాహన కల్పించారు.

చినతోలుమండకు బిటి రోడ్డు నిర్మించాలి

ప్రజాశక్తి - కురుపాం

జియ్యమ్మవలస మండలం అలమండ పంచాయతీ చినతోలు మండ గ్రామానికి రహదారి నిర్మించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొల్లి గంగునాయుడు, మండల కార్యదర్శి కోరంగి సీతారాం డిమాండ్ చేశారు. శనివారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జియ్యమ్మ వలస నుండి నిడగల్లగూడ మీదుగా చినతోలుమండ వరకు సుమారు మూడు కిలోమీటర్లు రోడ్డు రాళ్లు, గోతులు ఏర్పడడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కనీసం స్పందించ లేదన్నారు. బిటి రోడ్డు నిర్మించాలని అనేక ఏళ్లుగా ప్రజాప్రతినిధులను వేడుకున్నా ఈ రోడ్డు వంక చూడలేదన్నారు. మండల కేంద్రాలకు వచ్చిన గిరిజనులు నిత్యవసర సరుకులు, రేషన్ బియ్యం, అటవీ ఉత్పత్తులు తలపై పెట్టుకొని మూడు కిలోమీటర్లు కాలినడకన ఎక్కి దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గర్భిణీలు, వ్యాధిగ్రస్తులను డోలీలు కట్టి దిగువకు దించుతున్నారని తెలిపారు. బిటి రోడ్డు మంజూరు చేసి వెంటనే నిర్మాణం చేపట్టాలని చినతోలు మండ గిరిజనులతో కలిసి నిరసన తెలిపారు. ఒక్క చిన్నతోలు మండే కాకుండా మండలంలో ద్రాక్షని, చాపరాయి గూడ, బాపనగూడ, ఆర్నాడ, బిల్లమానుగూడ, అర్నాడ వలస తుమ్మి గూడ, దంగ భద్రవలస, చిలకల వానివలస, పసుపువాని వలస గిరిజన గ్రామాలకు సరైన రహదారి మార్గాలు లేవని గిరిజన గ్రామాలకు అన్నింటికీ వెంటనే బిటి రోడ్లు మంజూరు చేసి నిర్మాణం చేయాలని డిమాండ్ చేస్తూ జనవరి 9న జియ్యమ్మవలస ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ మండల కార్యదర్శి గోరపాడు సోమయ్య, గిరిజనులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న గ్రామస్తులు, నాయకులు

వెంకంపేట పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ పరిధిలో గల వెంకంపేట వీధి పాఠశాలను తనిఖీ బృందం సందర్శించింది. డిప్యూటీ డిఇఒ పి.కృష్ణమూర్తి, ఎంఇఒ కె.సోంబాబు, తనిఖీ బృందం సభ్యులు కె.తిరుమలరావు, సిద్ధాబత్తుల వెంకటరమణ, వాకముడి భారతి, మీసాల రామలక్ష్మి, గొర్లె రాంబాబు, చింతు బుచ్చన్న పాఠశాలను తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా డిప్యూటీ డిఇఒ మాట్లాడుతూ ఆంగ్ల భాషా మాధ్యమంలో విద్యాబోధన జరగాలని, టోఫెల్, లెర్న్ ఎ వర్డ్ ఎ డే, ఐ.ఎఫ్.పి. స్క్రీన్ ప్లే చేయడంలో మరింత కృషి చేయాలని అన్నారు. ఎంఇఒ సోంబాబు మాట్లాడుతూ పాఠశాల అసెంబ్లీలో విద్యార్థులంతా క్రమశిక్షణ, నిబంధనలు పాటించారని అన్నారు. పాఠశాలలో అమలవుతున్న నేషనల్ గ్రీన్ క్రాప్స్‌ను పరిశీలించారు. పాఠశాల పనితీరుపట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ తగు సూచనలిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జి.పరంకుశంనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం హైదరాబాద్ హిందీ ప్రచార సభ నాగరిబోర్డ్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన బాలబాలికలకు డిప్యూటీ డిఇఒ, ఎంఇఒ, హెచ్ఎం చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు.